ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 17 అక్టోబరు 2025



రూపాయికే.. ఇంటి ప్లాను 8లో..
పేద, మధ్య తరగతికి వెసులుబాటు ● అవగాహనపై అధికారుల నిర్లక్ష్యం

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి
● మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు 6లో..



సూపర్ జీఎస్టీ సైకత శిల్పం వద్ద కలెక్టర్ వి.వినోద్‌కుమార్, అధికారులు

పర్యాటకాభివృద్ధికి చర్యలు

● జిల్లాకు రూ.97.52 కోట్లు మంజూరు ● జీఎస్టీ అవగాహనలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు సూర్యలంక సముద్రతీరంలో ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని గురువారం అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి రూ.97.52 కోట్లు మంజూరయ్యాయన్నారు. సూర్యలంక బీచ్‌లో టాయిలెట్లు, స్నానపు షవర్లు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, దుస్తుల మార్పు గదులు, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వారంరోజులు షాపింగ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. బీచ్‌లో విషాద ఘటనల నివారణకు బీచ్ వద్ద 15 మంది గజ ఈతగాళ్లను, నాలుగు బోట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో ప్రభాకర్, మెప్మాపీడీ సత్యానంద్‌పాల్, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గ్లోరియాకుమారి, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా, మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బర్లీకి గడువు పెంపు



పర్చూరు మార్కెట్‌యార్డులో బర్లీ పొగాకు కొనుగోళ్లు (పాత చిత్రం)

రూ.128 కోట్లు మిగులు

మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం రూ.273 కోట్లు కేటాయించింది. మార్క్‌ఫెడ్ గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు రూ.145 కోట్ల విలువైన బర్లీ పొగాకును మాత్రమే కొనుగోలు చేశారు. అంటే కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.128 కోట్లు మిగులు ఉన్నట్లు సమాచారం. ఈ నెల 25తో కొనుగోళ్లకు తెరపడనుంది. ప్రస్తుతం ఉన్న మూడు కేంద్రాల్లో గడువు ముగిసే నాటికి గరిష్ఠంగా ఇంకో రెండు వేల క్వింటాళ్ల బర్లీ సేకరణ జరగొచ్చని అంచనా. కేటాయించిన నిధుల్లో భారీగా మిగులుపై మార్క్‌ఫెడ్ నుంచి పొంతన లేని సమాధానాలు వస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కొనుగోళ్లు లేక ఆందోళనలో ఉన్న బర్లీ రైతులకు ఉపశమనం కలిగిస్తూ మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం జూన్ నుంచి కొనుగోళ్లు చేపట్టింది. సెప్టెంబరు నెలాఖరుతో బర్లీ కొనుగోళ్లు నిలిపివేస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అయితే రైతుల వద్ద ఇంకా భారీగా నిల్వలు ఉన్నాయి. మార్క్‌ఫెడ్ నివేదికల ఆధారంగా అక్టోబరు 15 వరకు కొనుగోళ్లు జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ఆ గడువు కూడా ముగిసింది. అయినా ఇంకా నిల్వలు భారీగా ఉండటంతో బర్లీ రైతుల కోసం రెండోసారి పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఈ నెల 25 వరకు బర్లీ పొగాకును కొనుగోలు చేయడానికి షెడ్యూల్ ఇచ్చినట్లు మార్క్‌ఫెడ్ ప్రకటించింది. అయితే బాపట్ల జిల్లాలో బర్లీ నిల్వలు అధికంగా ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉన్నాయి. ప్రస్తుతం మూడు కేంద్రాల్లో మాత్రమే బర్లీ పొగాకు సేకరణ జరుగుతుంది. క్షేత్రస్థాయిలో రైతుల వద్ద ఇంకా దాదాపు 50,000 క్వింటాళ్ల వరకు బర్లీ నిల్వలు ఉన్నట్లు సమాచారం.

● ఈ నెల 25 వరకు కొనుగోళ్లు
● మూడు కేంద్రాల్లో కొనసాగుతున్న సేకరణ
● ఇంకా రైతుల వద్ద దాదాపు 50,000 క్వింటాళ్లు

ప్రతిబంధకంగా నిల్వ సమస్య

నాలుగు జిల్లాల పరిధిలో పెద్దఎత్తున కేంద్రాలను ఏర్పాటు చేసి నాలుగు నెలల నుంచి మార్క్‌ఫెడ్ రైతుల నుంచి బర్లీ పొగాకును కొనుగోలు చేసింది. ఇప్పటికే బాపట్ల జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లో కూడా ఖాళీగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు గోడౌన్‌లన్నింటిని బర్లీ పొగాకు నిల్వల కోసం మార్క్‌ఫెడ్ తీసుకుంది. అయితే ప్రస్తుతం ఎక్కడ కూడా బర్లీ నిల్వల కోసం గోదాములు అందు బాటులో లేవు. అయితే ఆ పొగాకు నిల్వలకు గిడ్డంగుల లభ్యత ప్రతిబంధకంగా మారింది. దీంతో కొనుగోలు కేంద్రాలను తగ్గించారు. దీంతో కొనుగోళ్లు మందగించడం.. అదే సమయంలో గడువు కూడా ముగిసింది. అయితే రైతుల అభ్యర్థనల మేరకు ఇప్పటికే రెండు సార్లు కొనుగోళ్లకు సం బంధించి గడువు పెంచారు.

2,11,000 క్వింటాళ్ల సేకరణ

ఇప్పటి వరకు నాలుగు జిల్లాల పరిధిలో 2,11,000 క్వింటాళ్ల పొగాకును మార్క్‌ఫెడ్ సేకరించింది. ఇందులో బాపట్ల జిల్లా వాటా 1,42,500 క్వింటాళ్లు ఉండగా, గుంటూరు జిల్లాలో 32,500, పల్నాడు జిల్లాలో 23,000, ప్రకాశం జిల్లాలో 13,000 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.93 కోట్లు జమయ్యాయి. ఇంకా రూ.52 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది.

చినుకుపడితే చిత్తడి

● వర్షాలతో అధ్వానంగా రోడ్లు
● గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం
● జీతాల్లేక విధులకు రాని కార్మికులు..



మురుగునీటితో ఈపూరుపాలెంలో ఓ వీధి

చీరాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా నియోజకవర్గంలో కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలు కారణంగా ప్రధాన రహదారులు కోతకు గురవుతున్నాయి. నీళ్ల నిండి వంకలను తలపిస్తున్నాయి. కొన్ని రోడ్లు మురుగు నీటితో దుర్వాసన వెదజల్లుతున్నాయి. కోతకు గురయిన రోడ్లలో వాహనదారులు పట్టుతప్పుతున్నారు. గతంలో రోడ్లకు పాలకులు మరమ్మతులు చేపట్టినా.. పనుల్లో పారదర్శకత ఎక్కడా కనిపించడం లేదు. ఈపూరుపాలెం నుంచి పలు ప్రాంతాల రహదారులు అధ్వానంగానే ఉన్నాయి. నిత్యం చీరాల నుంచి బాపట్ల, గుంటూరు, విజయవాడకు వెళ్లే బస్సులు, భారీ వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మార్గంలోనే ఈపూరుపాలెం వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. గుంతలతో.. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన బలహీనపడింది. సైడ్ దిమ్మెలు పూర్తిగా ఇరిగిపోయాయి. అధికారులు యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ప్రజలు, విశ్లేషకులు చెబుతున్నారు.



ప్రమాద భరితంగా ఈపూరుపాలెం వంతెన

అధ్వానంగా పారిశుధ్యం..

ఎన్నికలు లేని కారణంగా పంచాయతీలకు నిధుల్లేవు. దీంతో పారిశుధ్య కార్మికులకు జీతభత్యాలు అందడం లేదు. ఒక్కో పంచాయతీలో నాలుగు లేక నెలల తరబడి జీతాలు నిలిచిపోయాయి. దాదాపుగా నియోజకవర్గంలో సింహభాగం గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు పనులకు మొరాయించారు. దీంతో వీధులు అధ్వానంగా మారాయి.

జీఎస్టీ 2.0తో ప్రజలకు మేలు

రవాణాశాఖ ర్యాలీలో జేసీ భావన వశిష్ఠ

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో పేదలకు మేలు జరుగుతుందని జేసీ భావన వశిష్ఠ తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని మున్సిపల్ కార్యాలయం వద్ద జేసీ వశిష్ఠ, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబులు ప్రారంభించారు. అంబేద్కర్ సర్కిల్ వరకు జరిగిన ర్యాలీలో డ్రైవర్లు వాహనాలతో, ప్రజలు ప్లకార్డులతో పాల్గొన్నారు. సూపర్ జీఎస్టీ ద్వారా జరిగే మేలు గురించి అధికారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, జిల్లా క్రీడాధికారి పాల్‌కుమార్ పాల్గొన్నారు.



జీఎస్టీ ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ భావన వశిష్ఠ, బావుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు



రైస్ మిల్లులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

● రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
● కూచిపూడిలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అమృతలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు అవసర మైన అన్ని ఏర్పాట్లను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులు, మిల్లర్లను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని కూచిపూడిలో రైస్‌మిల్లును, రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం సేకరణకు, నిల్వలకు అవసర మైన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు కోతలు ప్రారంభం అవుతాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులో, రైతు సేవా కేంద్రంలో నిల్వకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ నెహ్రూబాబు, ఏవో హేమంత్ భరత్‌కుమార్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

నవంబరు మూడో వారం నుంచి సేకరణ

బాపట్ల: జిల్లాలో ధాన్యం సేకరణ నవంబరు మూడో వారం నుంచి ప్రారంభిస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ధాన్యం సేకరణ, పెన్షన్ రీఅసెస్మెంట్, స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ, ఈ-పంట తదితర అంశాలపై కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు ధాన్యాన్ని మిల్లులకు అందజేయరాదన్నారు. ధాన్యం సేకరణ సమయంలో ప్రతీ రైస్‌మిల్లుకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని ఆర్డీవోలకు సూచించారు.

పీజీఆర్ఎస్ సెల్‌లో తనిఖీలు..


పీజీఆర్ఎస్ సెల్‌ను కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదుల నమోదు, పరిష్కారం, సంబంధితశాఖల స్పందన విధానాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ నేరుగా ఓ అర్జీదారుడికి ఫోన్ చేసి సమస్య వివరాలు తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ ఆదేశాలు

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల్లో అందజేసే పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. మాతృ మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం గురువారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరి గింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భం దాల్చిన వారిని మొదటి మూడునెలల్లో నమోదు చేయాలన్నారు. హైరిస్క్ గర్భవతులను సకాలంలో గుర్తించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే సేవలను గురించి ప్రజలకు తెలియజేసి, కాన్పు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, డీఐవో డాక్టర్ రత్నమన్మోహన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ రామకృష్ణ హనుమాన్, డాక్టర్ రాజేష్, డాక్టర్ జయసింహ, ఎస్.సుగుణమ్మ, ఐసీడీఎస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దీపావళికి ప్రత్యేక రైళ్లు



గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగకు స్వస్థలాలకు వచ్చి వెళ్లే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రజా సంబంధాల అధికారి వినయ్ కాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 07497 తిరుపతి - సికింద్రాబాద్ స్పెషల్ ఈ నెల 17న రాత్రి 7.40కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.30కి తెనాలి, 2.20కి గుంటూరు, 3 గం టలకు సత్తెనపల్లి, 18న వేకువజామున 4 గంటలకు నడికుడి, ఉదయం 8.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. 07213 విజయవాడ - సికింద్రాబాద్ స్పెషల్ ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 6.25 గంటలకు బయలుదేరి 7.03కి మంగళగిరి, 7.30కి గుంటూరు, 8.18కి సత్తెనపల్లి, 8.48కి పిడుగురాళ్ల, 9.18కి నడికుడి, మధ్యాహ్నం 12.18కి చర్లపల్లి, ఒంటి గంటకు సికింద్రాబాద్ చేరుకొంటుంది. 07214 సికింద్రాబాద్ - విజయవాడ స్పెషల్ ఈ నెల 17, 18 తేదీల్లో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి 4.18కి చర్లపల్లి, 6.28కి నడికుడి, 6.58కి పిడుగురాళ్ల, రాత్రి 7.28కి సత్తెనపల్లి, 8.25కి గుంటూరు, 8.58కి మంగళగిరి, 9.30కి విజయవాడకు చేరుకుంటుంది.

కొట్టేసింది రూ.కోట్లు.. రికవరీ సున్నా..



జిల్లా	దుర్వినియోగం (రూ.కోట్లలో)	రికవరీ
● పల్నాడు	1.99	0.00
● బాపట్ల	2.15	0.00
● గుంటూరు	0.83	0.00
మొత్తం	4.97	0.00

● ఉపాధి పనుల్లో రూ.4.97 కోట్లు స్వాహా
● సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన వైనం
● అక్రమార్కులపై చర్యలు శూన్యం

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

వలసలు తగ్గించి, పేదలకు నివసించే చోటే పని కల్పించాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకానికి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. అందిన కాడికి దోచుకుంటున్నారు. ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినా చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో అక్రమార్కులు రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్నారు. తిలా పాపం.. తలా పిడికెడు.. అన్న చందంగా ఇందులో అందరి పాత్ర కనిపిస్తోంది. కూలీల కష్టాన్ని దోచుకున్నది కొందరైతే, దొంగ మస్టర్లతో సొమ్ము పక్కదారి పట్టించింది మరి కొందరు. రూ.కోట్లల్లో నిధులు పక్కదారి పట్టినట్లు బయటపడినా చర్యలు లేవు. సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తున్న ఉదంతాలే ఇందుకు నిదర్శనం. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ఉపాధి పనుల్లో రూ.4.97 కోట్ల దుర్వినియోగం జరిగినట్లు సోషల్ ఆడిట్‌ల ద్వారా నిర్ధారించారు. కానీ, ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా అక్రమార్కుల నుంచి రికవరీ చేయలేదంటే.. ఏ స్థాయిలో వారికి అండదండలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాల్లో.. రూ.కోట్లల్లోనే అవినీతి

పనికి హాజరు కాని కూలీలతో కుమ్మక్కై మస్టర్లలో పేర్లు నమోదు చేసి.. డబ్బులు జమయిన తర్వాత ఉపాధి సిబ్బంది పంచుకుంటున్నారు. చేయని పని చేసినట్లుగా.. పాత పనినే కొత్తగా చేసినట్లు చూపించి సొమ్ము కాజేస్తున్నారు. పలు చోట్ల నకిలీ జాబ్ కార్డులకు బ్యాంకు ఖాతా సృష్టించి అవినీతికి పాల్పడ్డారు. ఇందులో కొందరు క్షేత్రస్థాయి సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీవోలు భాగస్వాములు అయ్యారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో జిల్లాలో రూ.కోట్లల్లోనే అక్రమాలు వెలుగు చూశా యి. మొక్కుబడిగా సామాజిక తనఖీలు చేస్తూ.. అక్రమార్కులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్స రానికి రూ.4.97 కోట్లు అవినీతి జరిగినట్లు తేలింది. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టి.. ఉద్యోగాల నుంచి తొలగించాలి. వారి నుంచి సొమ్ము రికవరీ చేయాలి. చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు మీన మేషాలు లెక్కపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యమైన మద్యానికి.. సురక్షయాప్

● ఇక కల్తీ మద్యం నివారణ సులభతరం ● తనిఖీల్లో ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మద్యం కోసం కొను గోలు దారులు సురక్షయాప్‌ను వినియోగించుకోవాలని ఎక్సైజ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. బాపట్లలో గురువారం పలు మద్యం దుకాణాల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం బాటిళ్లపై స్కానింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష పేరుతో కన్స్యూమర్, రిటైలర్ల కోసం ప్రత్యేకంగా రెండు యాప్‌లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ యాప్‌లను ప్లే స్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని మద్యం సీసాపై స్కాన్ చేస్తే సదరు మద్యం సీసాకు సంబంధించిన సమగ్ర వివరాలు అందులో కనిపిస్తాయన్నారు. దీనివల్ల సదరు మద్యం అసలా, నకిలీదో పసిగట్టవచ్చన్నారు. జిల్లాలో అనధికార మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఎవరైన తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



మద్యం దుకాణంలో బాటిల్‌ను స్కాన్ చేస్తున్న ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు

జనవరి 4 నుంచి టైపు రైటింగ్ పరీక్షలు

గుంటూరు (విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 4న షార్ట్ హ్యాండ్, 24, 25 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ టెక్నికల్, టైపు రైటింగ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ ప్రకాష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్దేశించిన సమయంలో ఫీజులు చెల్లించాలని, ఇందుకుగాను సమీపంలోని టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్స్ ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్వీఆర్‌జేసీ అధ్యాపకురాలి పరిశోధనకు అవార్డు



డాక్టర్ కవితను అభినందిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

గుంటూరు (విద్య) అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కవిత పరిశోధనకు జాతీయ స్థాయిలో అవార్డు లభించినట్లు కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పుదుచ్చేరిలో వీడి గుడ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సహకారంతో బ్రైనీమీట్ సంస్థ అవార్డు అందజేసినట్లు పేర్కొన్నారు. డాక్టర్ జి.కవిత.. అడసోర్పన్ ఆఫ్ టెక్స్‌టైల్ డైస్ యూసింగ్ బయో ఆక్టివ్ ఫిల్టర్ బెడ్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను అవార్డు లభించినట్లు వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల డైరెక్టర్లు డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎం.వి.పి.చంద్రశేఖర్ రావు, సీఈఓ డాక్టర్ ఆర్.హాఫీజ్ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

తనఇష్టం లేకుండా చెల్లిని చేసుకున్నాడనే హత్య

- గణేష్ హత్య కేసులో ఏడుగురి నిందితుల అరెస్టు
- ప్రేమ పెళ్లి చేసుకున్న 14 రోజులకే బావను చంపిన బావమరిది
- వివరాలు వెల్లడించిన ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తన ఇష్టం లేకుండా తన చెల్లిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడనే.. అక్కసుతో బావను 14 రోజులకే అత్యంత దారుణంగా బావమరిది హత్య చేసిన కేసులో.. ఏడుగురు నిందితులను పాత గుంటూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, ఆయన వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా అమర్తలూరు మండ లం యాడఊరు గ్రామానికి చెందిన కుర్రా గణేష్ బుడంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. దూరపు బంధువు, తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన కీర్తి వీరాంజనేయదేవిని పెళ్లి చేసుకునేందుకు పెళ్లి చూపులకు వెళ్లాడు. అయితే గణేష్ పొట్టిగా ఉన్నాడని, తన చెల్లెల్ని ఇవ్వనని దేవి అన్నయ్య కీర్తి దుర్గారావు అయిష్టం వ్యక్తం చేయడంతో.. వారి పెళ్లి చూపులతోనే ఆగిపోయింది.

అయితే అప్పటికే ఒకరి ఫోన్ నంబరు ఒకరు తీసుకున్న గణేష్, దేవి ఇద్దరూ తరచుగా మాట్లాడుకుంటూ ప్రేమలో పడ్డారు. ఇద్దరూ అమరావతిలో వివాహం చేసుకొని నల్లపాడు పోలీసులను ఆశ్రయిం చారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దుర్గారావు పోలీసుల ముందే.. గణేష్‌ని చంపేస్తానని హెచ్చరికలు చేశాడు. అన్నట్లుగానే ఈ నెల 7న తన బావ గణేష్‌ను హతమార్చేందుకు పథకం రూపొందించాడు. తన స్నేహితులు కొలకలూరుకు చెందిన షేక్ నూర్ బాషా జిలాని, బత్తెన లోకేష్, కీర్తి పాములు, నందివెలుగు గ్రామానికి చెందిన తుమ్మల శివయ్య, జంప ని వంశీ, గుంటూరు రూరల్ మండలం గొర్లవారిపాలేనికి చెందిన శా ఖమూరి గోపీకృష్ణ, కుంచనపల్లికి చెందిన దాసరి వీరయ్య తదితరుల సహకారంతో గణేష్‌ను అత్యంత దారుణంగా హత్య చేశాడు. పొన్నూరు రోడ్డులో ఎం కన్వెన్షన్ వద్ద దుర్గారావు మరో ఇద్దరు కలిసి... స్కూటీపై వస్తున్న గణేష్‌ను అడ్డగించి విచక్షణారహితంగా కత్తులతో పొడిచారు. అడ్డం వచ్చిన గణేష్ స్నేహితుడు రంగుల కరుణాని కూడా చంపేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ నుంచి కరుణ పారిపోయాడు. తీవ్ర రక్తపు మడుగులో ఉన్న గణేష్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే చనిపోయాడు. మృతుడి తండ్రి శివాంజనేయులు ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసిన పాత గుంటూరు పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు, మృతుని బావమరిది దుర్గారావు నేరుగా కోర్టులో లొంగిపోయాడు. హత్యకు ఉపయోగించిన కత్తులు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం పరుచుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభను కనబరిచిన పాత గుంటూరు పోలీసులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించినట్లు తెలిపారు.



నిందితులను అరెస్టు చేసిన డీఎస్పీ అజిత్, సీఐ వెంకట ప్రసాద్. (వెనుక వరుసలో అరెస్టయిన నిందితులు (ఇన్‌సెట్‌లో) హత్యకు ఉపయోగించిన కత్తులు

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుర్తించిన ఏఎంసీల పరిధిలో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ ఏడీ కార్యాలయంలో ఆయన ఏఎంసీల సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. ఇందు కోసం అన్ని విషయాలపై స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనుభవం ఉన్న సిబ్బందికి డ్యూటీలు వేయాలన్నారు. అలానే ఏఎంసీల మార్కెట్ ఫీజు వసూళ్లని లక్ష్యం మేరకు చేయాలని ఆదేశించారు. రైతుబజార్ల ఆధునికీకరణకు ప్రతిపాదనలు నివేదించాలన్నారు. కృష్ణనగర్ రైతుబజార్ టెండర్ ప్రక్రియని పూర్తి చేసి.. త్వరితగతిన పనులు ప్రారంభం అయ్యేలా చేడాలన్నారు. మిర్చి యార్డులో ఎగుమతులకు లారీ ఓనర్ల కారణంగా ప్రతిష్టంభన తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. ఆడిట్ అభ్యంతరాలు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ డీడీ దివాకర్, ఏడీ సత్యన్నారాయణ చౌదరి పాల్గొన్నారు.



ఏఎంసీల సెక్రటరీలతో సమావేశమైన జేడీ శ్రీనివాసరావు

గోల్డెన్ అవర్స్‌లో మెరుగైన పక్షవాత చికిత్సలు

● న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పక్షవాతం వస్తే సకాలంలో స్పందించి గోల్డెన్ అవర్స్‌లో (మొదటి నాలుగున్నర గంటలు) వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాలని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ న్యూ రాలజిస్ట్ డాక్టర్ పి.విజయ సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలితో సాధ్యమైనంత వరకు పక్షవాతం బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పక్షవాత అవగాహన మాసం సందర్భంగా కొత్త పేటలోని లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో గురువారం నిర్వహించిన స్ట్రోక్ సర్వైవర్స్, కేర్ గీవర్స్ మీట్‌లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసం గించారు. పక్షవాతం బారిన పడ్డ రోగులకు గోల్డెన్ అవర్‌లో వైద్యచి కిత్సలు అందిస్తే వారు కోలుకొని సాధారణ జీవితం గడిపే అవకా శాలు అధికంగా ఉంటాయని వెల్లడించారు. ఈ సందర్భంగా పక్షవాతం నుంచి కోలుకున్న రోగులు (స్ట్రోక్ సర్వైవర్స్), వారి కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను, జ్ఞాపకాలను, కో లుకున్న పద్ధతులను పంచుకున్నారు. కొంతమంది స్వచ్ఛందంగా వచ్చి మాట్లాడుతూ.. ఇలాంటి విలువైన కార్యక్రమానికి హాజరైన తరు వాత ప్రజల్లో అవగాహన పెంచడం మన కనీస బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు వీరమ్మ, రేష్మ, ఉషాకిరణ్ బెహరా, అజ్మానాజ్, అజయ్, సైకాలజిస్ట్ సరోజ, ఫిజియోథెరపీ, డైటిషియన్, లైఫ్ స్టైల్ కౌన్సిలింగ్ నిపుణులు పాల్గొన్నారు.



కేర్ గివర్స్ మీట్‌లో డాక్టర్ విజయ, డాక్టర్ వీరమ్మ

మహిళ అత్యాచారం కేసు విచారణలో పురోగతి

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు బోగీలో ఒంటరి మహిళపై అత్యాచారం, దోపిడీ కేసులో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన మహిళ ఈ నెల 13న సంత్రాగచ్చి- చెర్లపల్లి స్పెషల్ ట్రైన్‌లో సికింద్రాబాద్ వెళ్తోంది. ఆగంతుకుడు గుంటూరు సమీపంలో ఆమె ఉన్న బోగీలో ఎక్కేందుకు ప్రయత్నించాడు. డోర్ తీయమని ప్రాధేయపడ్డాడు. కదిలే రైలు నుంచి పడిపోతాడని భయపడిన బాధిత మహిళ డోర్ తెరిచింది. దీంతో లోనికి ప్రవేశించిన అగంతకుడు కత్తితో ఆమెను బెదిరించి అత్యాచారం చేయడమే కాకుండా.. ఆమె బ్యాగును అపహరించుకుపోయాడు. రూ.5,600 నగదు, సెల్ ఫోను ఉన్నాయి. నిందితుడు నల్లపాడు పోలీస్‌స్టేషన్ వద్ద బోగీలోకి ప్రవేశించి కేవలం 12 నిమిషాల వ్యవధిలో పెదకూరపాడు రైల్వేస్టేషన్‌కు స మీపంలో రైలు వేగం నెమ్మదించడంతో దిగి పారిపోయాడు. బాధి తురాలు సికింద్రాబాద్ వెళ్లిన తర్వాత అక్కడ ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైలులో ఒంటరిగా ఉన్న మహిళపై అత్యాచారం ఘటన సంచలనం సృష్టించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గతంలో రైళ్లలో ఈ తరహా నేరాలకు పాల్పడిన పాత నేరస్తుల జాబితాను తిరగేస్తున్నారు. విజయవాడ, ఒంగోలుకు చెందిన పలువురిని అనుమానిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు ఆయా అనుమానితుల ఫొటోలను బాధితురాలికి పంపి నిందితుడిని గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. మరోవైపు సీసీ ఫుటేజీలతో పాటు సెల్ ఫోన్ డంప్‌ను కూడా పరిశీలిస్తున్నారు.

గురువారం రాత్రికి నేరస్తుడికి సంబంధించి పోలీసులు కొంత పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో నిందితుడిని పట్టుకుంటామని రైల్వే పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.ఈ కేసులో నిందితులను పట్టుకున్నామని సో షల్ మీడియాలో జరుగుతోన్న ప్రచారాన్ని రైల్వే పోలీసులు ఖండించారు.

తెనాలి రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత



గంజాయి ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటాద్రి, తహసీల్దార్ గోపాలకృష

తెనాలి క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వే స్టేషన్‌లో పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి గురువారం వెల్లడించారు. (18189)టాటానగర్ నుంచి ఎర్నాకుళం వెళ్లే రైలులో అనుమానాస్పదంగా బ్యాగు ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒకటవ ప్లాట్‌ఫాంలో రైలు ఆగగానే బోగీలను సిబ్బంది పరిశీలించారు. ఎస్ 5 బోగీలో అనుమానాస్పదంగా ఉన్న బ్యాగ్‌లో నాలుగు సీల్డ్ ప్యాకెట్లును గుర్తించారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ సమక్షంలో వాటిని పరిశీలించగా 4.4 కిలోల గంజాయి లభించింది. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరుస దొంగతనాల కేసులో నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

కొల్లిపర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాల కేసుల్లో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు వివరాలు మేరకు.. కొల్లిపరకు చెందిన షేక్ శేషావలి(19) వరుస దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గ్రామంలో ఈ నెల 12, 13వ తేదీల్లో రాత్రి జొన్నల జాన్‌రెడ్డి, దూళ్ల వెంకటపుల్లారావు, తియ్యగూర విద్యాసాగర్‌రెడ్డి గృహాల్లో దొంగతనాలు జరిగాయి. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. నిందితుడు, కొల్లిపరకు చెందిన షేక్ శేషావలిని బుధవారం ఇంటి వద్ద అరెస్టు చేశారు. అతను దొంగిలించిన వస్తువులు ల్యాప్‌టాప్, ఫోను, వాచ్, సిల్వర్ రింగ్, బ్రాస్‌లెట్, దొంగతనానికి ఉపయోగించిన వస్తువును స్వాధీనం చేసుకున్నారు. గురువారం కోర్టులో నిందితుడిని హాజరు పర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పెదకోనేరులో దూకి మహిళ ఆత్మహత్య

మంగళగిరి సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గండాలయపేటకు చెందిన కామాక్షి (28) గురువారం ఉదయం కోనేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల ఆమె భర్త, కుమారుడు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఉంటుందని భావిస్తున్నారు. మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది కోనేరులోని మృతదేహాన్ని బయటకు తీశారు. పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాని పర్యటనపైనా వైసీపీ ఫేక్ ప్రచారం!

» దీనిపై కేంద్ర నిఘా వర్గాల ఆరా..?

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటనను సైతం వైసీపీ తన ఫేక్ ప్రచారానికి వాడుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటన సందర్భంగా తాము ఆయనకు పలు అంశాలపై వినతిపత్రాలు ఇచ్చినట్లు వాటిపై ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు వైసీపీ నాయకులు తమ సోషల్ మీడియా యాక్టివిస్టుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎటువంటి వినతి పత్రం ఇవ్వకుండానే వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని వైసీపీ తరఫున వినతి పత్రం ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. అధికారంలో ఉన్న 5 ఏళ్లలో వైసీపీ ఏనాడూ ప్రధాని పర్యటనకు ప్రొటోకాల్ ప్రకారం ప్రతిపక్ష పార్టీని ఆహ్వానించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం వైసీపీ ప్రజాప్రతినిధులను సైతం ఆహ్వానిస్తుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన గౌరవాన్ని కూడా వైసీపీ ప్రజా ప్రతినిధులు నిలబెట్టుకోవటం లేదు. ప్రధాని కార్యక్రమాన్ని సైతం వైసీపీ తమ ఫేక్ ప్రచారాలకు వాడుకోవడంపై కేంద్ర నిఘా వర్గాలు ఆరా తీసినట్లు సమాచారం.

ఏపీలో పాలియేటివ్ కేర్ కోర్సు

» హోమీ బాబా ఆస్పత్రిలో సీట్లకు అనుమతి: మంత్రి సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి ఉపశమనం కలిగించేలా ప్రత్యేక చికిత్స అందించే పాలియేటివ్ కేర్ విభాగంలో పీజీ కోర్సుకు అనుమతించినట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం తెలిపారు. ఈ చికిత్సకు సంబంధించి పీజీ డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టడానికి విశాఖపట్నంలోని హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి ముందుకు రావడంతో చికిత్సా కేంద్రానికి ఆమోదం తెలిపామని చెప్పారు. దీంతో రాష్ట్రంలో తొలిసారిగా పాలియేటివ్ కేర్ (ఉపశమన కోర్సు లేదా సహాయక సంరక్షణ కోర్సు) పీజీ కోర్సు ప్రారంభంకానుందని పేర్కొన్నారు. నాలుగు పీజీ సీట్లతో ప్రవేశాలు జరుగుతాయన్నారు. క్యాన్సర్, పక్షవాతం, గుండెజబ్బుల వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడే రోగులకు తీవ్రమైన నొప్పి నుంచి ఉపశమనం కలిగించే చికిత్స విధానాన్ని పాలియేటివ్ కేర్ అంటారు. దీని ద్వారా తగిన మందులు, మనోధైర్యం కోల్పోకుండా సలహాలు, సూచనలు, ఫిజియోథెరపీ అందిస్తూ.. రోగిని సంరక్షిస్తారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

మాతృ సంస్థకు శాప్ చీఫ్ ఇంజనీర్ సిద్ధయ్య

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించిన, 'ఆడుదాం ఆంధ్రా'లో కీలకంగా వ్యవహరించిన ఎం.సిద్ధయ్యను ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. కొన్నేళ్లుగా శాప్‌లో కీలకంగా వ్యవహరించిన ఆయనకు ఈ ఏడాది ఆగస్టు 5తోనే డిప్యుటేషన్ గడువు ముగిసింది. అయినా ఆయనను మరో ఏడాది కొనసాగించేందుకు క్రీడాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. అయితే దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం రావడంతో ప్రభుత్వం ఆయన డిప్యుటేషన్‌ను నిలిపివేసింది. ఆయనను మాతృ సంస్థకు పంపిస్తున్నట్లు క్రీడాశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఆర్ అండ్ బీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హోదాలో ఉన్న ఆయన వైసీపీ ప్రభుత్వ హయాంలో శాప్‌లోకి వచ్చారు. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలను దగ్గరుండి నిర్వహించారు. ఆ సమయంలో ఆయనపై కూడా కొన్ని ఆరోపణలు వచ్చాయి.

బనకచర్ల పీఎఫ్ఆర్‌ను పరిశీలించండి

» కేంద్ర జలసంఘానికి కేఆర్ఎంబీ వినతి

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సమర్పించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను పరిశీలించాలని కేంద్ర జల సంఘాన్ని కృష్ణా నదీ యాజమాన్య సంస్థ (కేఆర్ఎంబీ) కోరింది. పీఎఫ్ఆర్ ప్రతిని గురువారం దానికి పంపింది. వాస్తవానికి.. ఆంధ్రప్రదేశ్ ఈ పీఎఫ్ఆర్‌ను జూన్‌లోనే సమర్పించగా.. జల సంఘం కొన్ని వివరణలు కోరింది. ప్రాజెక్టును గట్టిగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ.. ఇటీవల డీపీఆర్ తయారీకి ఏపీ టెండర్లు పిలవడంపై తాజాగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కృష్ణా బోర్డు బనకచర్ల పీఎఫ్ఆర్‌ను జలసంఘానికి పంపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉన్నత విద్యను అందరికీ చేరువ చేస్తాం

» అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్ రావు

అమరావతి/ఏలూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర్ రావు గురువారం మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ఓపెన్ యూనివర్సిటీ ద్వారా యువతకు ఉపయుక్తమైన కోర్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను చేరువ చేస్తామన్నారు. విశ్వవిద్యాలయం కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను రెండ్రోజుల్లోగా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. విద్యార్థులు నష్టపోకుండా డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు కొన్ని రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని, నవంబర్ నుంచే విద్యా సంవత్సరం ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండలి వైస్ చైర్‌పర్సన్-2 రత్నశీల మణి, కార్యదర్శి బి.తిరుపతిరావు, జాయింట్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి పాల్గొన్నారు.

56,640 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 53,310 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 56,640 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,920 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14500	334	10500	15000
273	10500	13700	నెంబరు. 5	10000	14800
341	10000	15500	341	10000	15600
4884	----	----	4884	----	----
సూపర్ 10	----	----	సూపర్ 10	10000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15200	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15300
బ్యాడిగి	10500	15800	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000

గొట్టిపాళ్లలో చోరీ

● 7 సవర్ల బంగారం, రూ. 60 వేల అపహరణ

వెల్దుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గొట్టిపాళ్లలో ఓ గృహంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పులిమెల దానమ్మ తన తల్లిదండ్రులతో కలిసి జీవిస్తోంది. రెండు రోజుల క్రితం తెనాలిలోని బంధువుల ఇంటికి దానమ్మ తల్లిదండ్రులతో కలిసి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా.. వెనుకభాగం తలుపుల గడి ఒంగిపోయి ఉండడం గమనించారు. అనుమానం వచ్చి ఇంట్లో పరిశీలించగా గృహంలో దాచుకున్న ఏడు సవర్ల బంగారం, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి చోరీ జరిగిన గృహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు డ్వాక్రాగ్రూపుల సభ్యులకు శిక్షణ

పిట్టలవానిపాలెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలు నందు శుక్రవారం డ్వాక్రా ఈఎస్‌వో, గ్రూపు సభ్యులకు స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా 2025-2026కు సంబంధించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శేఖర్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతిఒక్కరు హాజరుకావాలని తెలిపారు.

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన జాయింట్ కలెక్టర్


ఎస్పీ ఉమామహేశ్వర్‌కు మొక్క అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన భావన వశిష్ఠ గురువారం ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి పలు విషయాలపై చర్చించారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

● డాక్టర్ శ్రీకాంత్

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆకస్మాత్తుగా వచ్చే గుండెపోటు నుంచి సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడువచ్చునని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్లో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారిచే సీపీఆర్‌పై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి మాట్లాడుతూ హృదయశ్వాసకోశ వ్యాధులపై పూర్తిస్థాయి అప్రమత్తత కలిగి ఉండటం ద్వారా సీపీఆర్ లాంటి వాటి ద్వారా ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉందన్నారు. సిబ్బంది దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్.నారాయణభట్టు, మున్సిపల్ డీఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, మేనేజర్ పి.లక్ష్మయ్య, రెవెన్యూఅధికారి జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.5లక్షలు స్వాహా

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శృంగారపురంనకు చెందిన తిరుపతి శ్రీనివాసరావుకు హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానంటూ రెండు సంవత్సరాలు క్రితం టీచర్స్ కాలనీకి చెందిన చల్లాపల్లి అనీల్‌కుమార్ 5లక్షలు తీసుకున్నాడంటూ గురువారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. ఈమేరకు ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళికి అనుమతులు తప్పనిసరి

● బాపట్లరూరల్ సీఐ శ్రీనివాస్

బాపట్లరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలో దీపావళి టపాసుల విక్రయదారులు పోలీసువారి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. అనుమతులు లేకుండా బాపట్ల మండల గ్రామాల్లో అనుమతులు లేకుండా దీపావళి టపాసులు అమ్మిన ఎడల అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్టూవర్టుపురంలో పోషకాహార మాసోత్సవాలు

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పడమర బాపట్ల సెక్టార్ పరిధిలోని స్టూవర్టుపురం అంగన్‌వాడీ కేంద్రం నందు గురువారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎస్.పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీడీపీవో లక్ష్మీపార్వతి ముఖ్యఅతిథిగా పాల్గొని పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. సీమంతాలు చేశారు. హ్యాండ్‌వాష్ ప్రాముఖ్యం గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యకర్తలు డి.శేషుకుమారి, స్వాతి, ఇందిర, సుధ, ఫాతిమా, పద్మావతి, నాగలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కుల నీటి విడుదల

దుగ్గిరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 1,122 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 201 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 211 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 400 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మండల ప్రజాపరిషత్ ఏవోగా వై.లవకుమార్


లవకుమార్

పిట్టలవానిపాలెం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా (ఏవో) వై.లవకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన బాపట్ల ఎంపీపీ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. వై.లవకుమార్ మర్యాదపూర్వకంగా ఎంపీడీవో సీహెచ్.శేఖర్‌బాబును కలిసినట్లు తెలిపారు.

ఐదేళ్ళలోపు చిన్నారులకు ఆధార్ తప్పనిసరి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్
● బిడ్డకు జన్మనివ్వగానే వైద్యశాలలో ఆధార్ నమోదు చేయాలి


ఆధార్‌కార్డుల నవీకరణ ప్రక్రియపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ళలోపు చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఆధార్‌కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై సంబంధితాధికారులతో గురువారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్‌కార్డు నమోదు తక్షణమే చేపట్టాలని చెప్పారు. తల్లి బిడ్డకు జన్మనివ్వగానే వైద్యశాలలోనే ఆధార్ నమోదు చేయాలన్నారు. ఏదైన కారణంతో నమోదు కాకపోతే అంగన్‌వాడీకేంద్రం పరిధిలోనే తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. 5 నుంచి 7 సంవత్సరాలలోపు బాలలకు, 15 నుంచి 17 సంవత్సరాలలోపు యువత అధార్‌కార్డుల్లో బయోమెట్రిక్ నవీనీకరణ తప్పనిసరిగా చేయించాలన్నారు. లేకుంటే వారికి ఆధార్‌కార్డులు రద్దు అవుతాయన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ఆధార్ నవీనీకరణ ప్రారంభిస్తారన్నారు. విద్యార్థులకు సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 110 ఆధార్‌కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 80 కేంద్రాలు పనిచేయటంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలల్లో బదిలీల ప్రక్రియ నేపథ్యంలో ఏర్పడిన సాంకేతిక సమస్యల ద్వారా 30 కేంద్రాలు పనిచేయటంలేదని ఆధార్‌కార్డుల రీజనల్ మేనేజర్ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రతి మండలంలో ఆధార్ కార్డుల నమోదు కేంద్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సమావేశంలోడీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, డీపీవో ప్రభాకరరావు, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్‌బాబు, కామన్ సర్వీస్‌సెంటర్ మేనేజర్ వందనం తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు భాగస్వాముల ప్రేరణ కార్యక్రమం

పరిశ్రమలు భాగస్వాముల ప్రేరణ కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పరిశ్రమలు పెట్టుబడుల భాగస్వాముల సదస్సును పురస్కరించుకొని రూపొందించిన గోడపత్రాలను గురువారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల భాగస్వాముల సదస్సు ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని కలెక్టర్ చెప్పారు. ప్రపంచ స్థాయిలో పెట్టుబడులదారులను ఆకర్షించేలా విశాఖ పట్టణంలో పరిశ్రమలకు సంబంధించి సదస్సు జరుగుతుందన్నారు. పరిశ్రముల ఆధునీకరణ, స్థిరీకరణ, పెట్టుబడుదారుల సంసిద్ధత, తోడ్పాటు, పరిశ్రమల పరిశుభ్రత, పరిశ్రమలలో మొక్కలు నాటటం తదితర అంశాలపై ఈ నెల 17 నుంచి నవంబరు 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏపీఐఐసీ ద్వారా జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో ఈ సదస్సులు జరుగుతాయన్నారు.

గుండ్లకమ్మ భూసేకరణ పనులు చేపట్టాలి

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌పై సంబంధితశాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ కింద 50 ఎకరాల భూసేకరణ చేయకపోవటంతోనే జిల్లాలో 13,876 ఎకరాలకు సాగునీరు రావటంలేదని చెప్పారు. ప్రస్తుతం గుండ్లకమ్మ ప్రాజెక్ట్ 17గేట్లు మరమ్మత్తులు పూర్తి కాగా మరొకటి పనులు జరుగుతున్నాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. తాజాగా జిల్లాలో 2,600 ఎకరాల భూమి ఆయకట్టు పరిధిలోకి తీసుకురావటానికి గజిట్ విడుదల చేయాల్సిఉందన్నారు. ఇందు కోసం అధికారికంగా ప్రకటన విడుదలకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. కొరిశపాడు, అద్దంకి మండలాల్లోని మూడు గ్రామాల్లో 1100 కుటుంబాలకు పునరావాసం కింద నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆర్డీవో, తహసీల్దార్‌లకు సూచించారు. సమావేశంలో ప్రాజెక్ట్‌ల ఎస్ఈ అబూతలీమ్, ఆర్డీవో చంద్రశేఖర్, ఉప కలెక్టర్లు, తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేయాలి


తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు

భట్టిప్రోలు(కొల్లూరు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. గురువారం కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు అమలు చేసి రూ.20 వేలు వారి ఖాతాలకు జమ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారని, వారికి ఆ పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలన్నారు. రైతులతో సంబంధం లేకుండా సీసీ కార్డులు కౌలు రైతులకు అందజేయాలని కోరారు. సీసీ కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు కౌలు రైతులు అనర్హులు అవుతున్నారన్నారు. ఈ-క్రాప్ కూడా నమోదు చేయకపోవడంతో పంట ఉత్పత్తులను విక్రయించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం సీసీ కార్డు పొందిన రైతుకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.సుధాకర్, రాంబాబు, మురుగుడు సత్యనారాయణ, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులకు వినియోగించవద్దు

● అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొల్లూరు, భట్టిప్రోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులకు వినియోగించవద్దని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కొల్లూరు, భట్టిప్రోలు ఎంపీడీవోలకు వినతిపత్రం అందించారు. గురువారం ఆయా మండలపరిషత్ కార్యాలయాల్లోని ఎంపీడీవోలు కె.నరసింహారావు, ఎస్.వెంకటరమణలను కలుసుకుని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ పింఛన్ విధులు ఎత్తి వేయాలని ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. గత రెండు నెలల నుంచి పింఛన్ విధులను అంగన్‌వాడీలు నిర్వహించడం వల్ల వారి శాఖాపరంగా చేయాల్సిన పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, నవంబరు నెల పింఛన్ విధుల నుంచి అంగన్‌వాడీలను తొలగించి వారి స్థానంలో మరొకరిని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు, కొల్లూరు, దోనేపూడి, భట్టిప్రోలు, వెల్లటూరు సెక్టార్ల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవసరాలకు అనుగుణంగా పిండి పదార్థాల సరఫరా

● ఐటీసీ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటరామిరెడ్డి


సభలో మాట్లాడుతున్న ఐటీసీ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటరామిరెడ్డి

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆశీర్వాద్ బ్రాండ్ వివిధ రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా పిండి పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు ఐటీసీలిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటరామిరెడ్డి తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాలలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ ఎం.సర్దార్‌బేగ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఐటీసీ సంస్థకు చెందిన ఉత్పత్తులు గురించి వివరించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనా రాణి మాట్లాడుతూ ఆహారోత్పత్తిలో మట్టికి ఉండే ప్రాధాన్యాన్ని వివరించారు. మట్టిలో ఉన్న ఖనిజాలు, పోషకాల వల్ల మొక్కల పెరుగుదల, ఆహార నాణ్యత మెరుగవుతుందని వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డీడీ స్మిత్ మాట్లాడుతూ ఆహార రంగంలో సుస్థిరమైన ఆహార వ్యవస్థల అభివృద్ధికి తమ దోహదం అందించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు తయారు చేసిన ఆహారోత్పత్తులను పరిశీలించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సహాయ ప్రొఫెసర్ డాక్టర్ బ్లెస్సీసాగర్ శీలం, ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు సమయ పాలన పాటించాలి

● ముగిసిన పౌష్టికాహార మాసోత్సవాలు


పోషక పదార్థాలను పరిశీలిస్తున్న ఎంపీపీ లలితకుమారి

కొల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల నిర్వహణలో సమయ పాలన పాటించాలని జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, ఉప ఎంపీపీ మురాల రాంబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను తిలకించారు. ముగింపు మాసోత్సవాల్లో సూపర్‌వైజరు రజని, కల్పన, శిరీష, రమ్యశ్రీ, కొల్లూరు, దోనేపూడి, అనంతవరం సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

● ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు (కొల్లూరు): ప్రతి కుటుంబం ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ డి.లలితకుమారి అన్నారు. గురువారం భట్టిప్రోలులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. సీమంతం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దారా కిరణ్మయి, సిడిపివో లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ సంపూర్ణ, ఏపీఎం, ఎంపీటీసీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్ ఆరోగ్యానికి హానికరం

● సీడీపీవో లక్ష్మీదేవి



పోషణమాసం ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో లక్ష్మీదేవి

అమృతలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జంక్ ఫుడ్ ఆరోగ్యానికి హానికరం అని సీడీపీవో లక్ష్మీదేవి గురువారం పేర్కొన్నారు. పోషణ్ మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో బాగంగా మండల పరిధిలోని బోడపాడు గ్రామంలోని అంగన్‌వాడీ-2 కేంద్రంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీమంతం కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ జంక్‌ఫుడ్ వల్ల ఊబకాయం వస్తుందని చెప్పారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వాటిని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ


మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ చేస్తున్న ఎస్టూనీడి ఫౌండేషన్ ప్రతినిధులు

బాపట్ల, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడవిగ్రామపంచాయతీ పరిధిలో విజయలక్ష్మీపురంనకు చెందిన పేద మహిళలకు గురువారం ఎస్టూనీడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు కుట్టుమిషన్‌లను ఉచితంగా అందజేశారు. వారు స్వయం ఉపాధికి తోడ్పాటునందించేందుకు వీటిని అందజేస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు తోట సురేష్‌బాబు తెలిపారు. గ్రామీణ మహిళ స్వయం ఉపాధి కల్పన, ఆర్థికస్వాలంబన దిశగా ఫౌండేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంటరి మత్స్యకార మహిళ, చోడిపిల్లి అప్పల నరసమ్మ, దినసరి కూలి అరికెల వెన్నెలలకు కుట్టుమిషన్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడవిపల్లెపాలెం గ్రామస్థులు శివగోగు, శిక్షకురాలు కుందేటి కుమారి, మద్దిబోయిన స్వప్న, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థుల ఇక్కట్లు


బస్సుకు వేలాడుతూ ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

కర్లపాలెం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని పలుపాఠశాల విద్యార్థులకు అవసరమైనన్ని ఆర్టీసీ బస్సులు లేక కళాశాలలకు, పాఠశాలలకు వెళ్ళేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందోలు వైపు నుంచి రేపల్లె వైపు నుంచి వస్తున్న అరకొర ఆర్టీసి బస్సులు చాలక బస్సులు కర్లపాలెం చేరుకునేసరికి బస్సులు ఫూల్ అయి రావటంతో విద్యార్థులకు బస్సులో ఎక్కేందుకు ఖాళీలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కాలేజి సమయం అయేసరికి బస్సులో ఖాళీలేకపోయన బస్సుడోర్‌లలోవేలాడుతూ విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసి అధికారులు అప్రమత్తమై విద్యార్థులకు అవసరమైన బస్సు సర్వీస్‌లను సక్రమంగా నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుకుంటున్నారు.

పోషకాహార సమస్యలను గుర్తించాలి

● సీఎస్ఆర్ డైరెక్టర్ భవిత

ఏఎన్‌యూ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పోషకాహార సమస్యలను గుర్తించి పౌష్టికాహారం అందించే దిశగా అడుగు లు వేస్తామని సీఎస్ఆర్ డైరెక్టర్ బి.భవిత అన్నారు. గురువారం ఫుడ్ అండ్ న్యూట్రిషన్, సీఎస్ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఆహార దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత, పోషకాహారం సహజ వనరులు, వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆహార నష్టాలు, వ్యర్థాలు తగ్గించాలని పేర్కొన్నారు. ఆహార భద్రతను ప్రోత్సహించడం, ఆహారంతో వ్యాధులను నివారించాలని సూచించారు. ఆహార భద్రతకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ ఉండాలన్నారు. పోషకాహార సమస్యలను గుర్తించి వారికి మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రోగ్రాం సీనియర్ ఆఫీసర్ వెంకటరమణ మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు పడే మహిళలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్



ఎన్టీఆర్ సర్కిల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న శివప్రసాద్, ఆర్డీవో ప్రసన్నకుమారి

రేపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి ప్రజలకు మేలుచేసిందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం ఎన్టీఆర్ సర్కిల్లో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరుతో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ శ్లాబ్‌లు సవరించటం వల్ల ప్రతికుటుంబానికి రూ.15వేలు ఆదాయం తగ్గనుందన్నారు. ప్రజల కొనుగోలు శక్తిపెరిగి దేశం అభివృద్ధి చెందతుందన్నారు. బాపట్ల ఆర్డీవో ప్రసన్నకుమారి మాట్లాడుతూ జీఎస్టీ శ్లాబ్‌ల సవరింపు వల్ల జరిగే ప్రయోజనాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు, మండలస్థాయి, గ్రామస్థాయి నాయకులు ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, నాయకులు దేవగిరిరవి, కొలసానిరాము, షేక్‌జమీర్, శ్రీనివాసరావు, ఆర్డీవో ఏజెంట్లు శ్రీనివాసరావు, కృష్ణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించటంలో చొరవ తీసుకోవాలి

● సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు


కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేసన శంకరరావు

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యలను పరిష్కరించటంలో చొరవ తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. కలెక్టర్‌ను గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో బీసీలు అత్యధికంగా ఉన్నారని ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల సమస్యలు ఉన్నాయని సత్వరమే వాటిని పరిష్కరించాలని కోరారు. జిల్లా పరిస్థితులపై కలెక్టర్, ఎస్పీలతో ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, కంకణాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల పెంపకంపై బాధ్యతగా వ్యవహరించాలి

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి


వేమూరులో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీలు

వేమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లల పెంపకంపై తల్లులు బాధ్యతగా వ్యవహరించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి సూచించారు. గురువారం వేమూరులో సెక్టార్ పరిధిలో పోషకాహార మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు జరిపి చిన్న పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల ఆరోగ్యం, తల్లిపాలు అంశంపై వివరించారు. సీఆర్ఏఫ్ కీర్తన మాట్లాడుతూ బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని స్నేహలత, సచివాలయ మహిళా పోలీసు అనూష, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు అభినందనీయం : సీడీపీవో


అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానిస్తున్న సీడీపీవో సుచరిత్ర

రేపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు చేస్తున్న సేవలు అభినందనీయమని సీడీపీవో ఎం.సుచరిత్ర అన్నారు. గురువారం స్థానిక సీడీపీవో కార్యాలయం నందు 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నపిల్లలకు, గర్భిణులు, బాలింతలకు మంచి విలువలతో కూడిన పోషకాలను అందిస్తుందన్నారు. శిశువుల ఆహారం ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఇంట్లో సమతుల్య ఆహారాన్ని అందిస్తే కుటుంబంలోని వారు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అనంతరం 40 సంవత్సరాలుగా సేవచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద డాక్టర్ మాధవి, సూపర్‌వైజర్లు సీహెచ్ హిమబిందు, తంబురాధిక, మంజుల, నాగలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

● వ్యవసాయశాఖ మండల ఇన్‌చార్జ్ వినయ్‌కుమార్


కారుమూరులో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేయటం వల్ల అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంట వస్తుందని వ్యవసాయశాఖ రేపల్లె మండల ఇన్‌చార్జ్ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం కారుమూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఎరువులు వాడటం వల్ల నాణ్యమైన పంట దిగుబడి రాదని కషాయాలు ప్రకృతి ఎరువుల ద్వారా పంటలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దశ పర్ణీ కషాయం తయారుచేయు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకసుబ్బారావు, వ్యవసాయ అధికారులు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.


ప్రధాని సభలో ముస్లిం మహిళలు


సభకు బస్సులు ఇలా...


మోదీతో చంద్రబాబు, పవన్











నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)




శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ


సభలో ఉప్పొంగిన దేశభక్తి


సభలో టీడీపీ మహిళా నేతలు






పొలాల వెంబడి పరుగులు

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మరింత మేలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● గుంటూరులో తగ్గింపు ధరలపై ఎగ్జిబిషన్, సేల్ ప్రారంభం

గుంటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా కుదించిన పన్ను శ్లాబులతో ప్రజలకు మరింత మేలు కలుగుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియం హాల్లో జీఎస్టీ తగ్గింపు ధరలపై ప్రదర్శన, అమ్మకాలను కలెక్టర్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, కమిషనర్ పులి శ్రీనివాసులు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. జీఎస్టీ తగ్గింపు ధరలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జీఎస్టీ తగ్గింపు ధరలపై అవగాహన కార్యక్రమాలను మన రాష్ట్రంలోనే నిర్వహించేలా సీఎం నిర్ణయించడం సంతోషదాయకమన్నారు. సచివాలయ స్థాయి నుంచి ఈ కార్యక్రమాలు జరిగాయన్నారు. రైతు సేవా కేంద్రాలు, పాఠశాలలు, వైద్య కేంద్రాలు తదితర అన్ని శాఖల క్షేత్ర స్థాయిలో నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు స్లాబ్‌లుగా ఉన్న జీఎస్టీని రెండు స్లాబ్‌లుగా తగ్గించిందని చెప్పారు. జీఎస్‌టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.8వేల కోట్ల నష్టం వస్తున్నప్పటికీ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం దీన్ని బలపరుస్తుందన్నారు. ప్రతి కుటుం బానికి నెలకు రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు ఆదా అవుతుందన్నారు. ధరలు తగ్గలేదని ఫిర్యాదులు రాకూడదని వ్యాపార వర్గాలకు సూచించారు. ఫిర్యాదులు స్వీకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ గీతామాధురి మాట్లా డుతూ ప్రతి వస్తువుపై జీఎస్టీ ధరల తగ్గుదల గమనించాలని ప్రజలను కోరారు. ధరలపై అనుమానాలున్నా వెంటనే ఫిర్యాదు చేయవచ్చని తెలి పారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జీఎస్టీ సహాయ కమిషనర్ ఆర్.అనసూయ, మల్లికార్జునరావు, కార్పొరేటర్ సమత, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయలక్ష్మి, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.


ఏసీ కళాశాల ఆడిటోరియం ప్రాంగణంలో ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు

19 వరకు ప్రదర్శన....అమ్మకాలు

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ గుంటూరు ఉత్సవ్‌లో భాగంగా ఏసీ కళాశాల ఆడిటోరియంలో గురువారం నుంచి 19వ తేదీ వరకు ప్రదర్శన, అమ్మకాలు జరుగనున్నాయి. ఉత్సవ్ ప్రత్యేక లోగో తయారు చేశారు. పచ్చళ్ళు, పొడులతో సహా గృహోపకరణాలు, క్రీడా పరికరాలు, జిమ్, సోలార్, బుక్స్ స్టేషనరీ, కెమిస్ట్ డ్రగ్గిస్ట్, వ్యవసాయ పరికరాలు, పురుగు మందులు, అన్ని రకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులు, వాహనాలు, ట్రాక్టర్లు తదితర దాదాపు 70 స్టాల్స్ ఏర్పాటు చేశారు. గుంటూరుకు చెందిన అక్షయ గో నిధి సంస్థ ఏర్పాటు చేసిన ప్రకృతి సహిత సామగ్రి పలువురిని ఆకర్షించింది.

రూపాయికే.. ఇంటి ప్లాను

పేద, మధ్య తరగతికి వెసులుబాటు
అవగాహనపై అధికారుల నిర్లక్ష్యం

పట్టణాలు, నగరాల్లో పేద, మధ్య తరగతి ప్రజలు సొంతింటి కల సాకారం చేసుకునేందుకు.. కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇంటి నిర్మాణ ప్లాను కోసం కాళ్లరిగేలా తిరగనవసరం లేకుండా.. వివిధ అనామక ఖర్చుల కింద రూ.వేలల్లో భరించాల్సిన అవసరం లేకుండా.. విముక్తి కల్పించింది. 50 చదరపు మీటర్ల సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకొనేందుకు చెల్లించాల్సిన ప్లాన్ రుసుం ఎత్తి వేసింది. రూపాయి చెల్లిస్తే అనుమతులు మంజూరు చేసేలా పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సత్తెనపల్లి పట్టణంలో 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మూడు నాలుగు వందలకు పైగా పక్కా గృహాలు ఉన్నాయి.

సత్తెనపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణదారుడు ప్లాన్ కోసం ఆన్‌లైన్‌లో స్థలం, పత్రాలు, ఆధార్ కార్డు, లింకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు, ఈసీ, మార్కెట్ విలువ, అఫిడవిట్, ఇతర వివరాలను నమోదు చేయాలి. అనంతరం రూపాయి చెల్లిస్తే పురపాలక సంఘం ప్రణాళిక విభాగంలో అధికారులు వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు.

గత ప్రభుత్వంలో చార్జీల మోత

గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటి నిర్మాణ అనుమతి రుసుం, దరఖాస్తు చార్జీలు, ట్రీ గార్డు, ఇంకుడు గుంత, ఆ ప్రాంత అభివృద్ధి చార్జీల పేరుతో రూ.15వేలు నుంచి రూ.20వేల వరకు వసూలు చేసే వారు. ఇంటికి 30 అడుగుల రహదారి ఉంటేనే ప్లాన్‌కు అనుమతి లభించేది. లేకుంటే తన స్థలంలోని 30 అడుగులను ఆయా పురపాలక సంఘానికి దాఖలు పరుస్తూ తన సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయిస్తే ప్లాన్ మంజూరు చేసే వారు. కూటమి ప్రభుత్వం నిబంధనలను సవరించింది.

నిస్తేజం వీడేదెన్నడూ?

ఐతే ఈ పథకం అమలు ప్రారంభించి కొద్ది నెలలు అవుతుంది. అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించక పోవడంతో పథకం అమలు ప్రశ్నార్థకంగా మారింది. దీని పై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన లేదు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో దీని పై ప్రచారం చేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


సత్తెనపల్లి ఏరియల్ వ్యూ

నకిలీ మద్యం గుట్టు ఇక రట్టు!

● మందుబాబుల చేతిలో మద్యం వివరాలు
● మొబైల్ యాప్‌తో అసత్య ప్రచారాలకు ప్రభుత్వం చెక్


ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌పై మద్యం షాపు నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ విజయకుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ములకల చెరువులో కల్తీ మద్యం తీగ లాగితే రాష్ట్రమంతా కదలింది. నకిలీ మద్యం గుట్టు విప్పేందుకు ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను తీసుకు వచ్చింది. మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా అసలా?, నకిలా అనేది గుర్తించవచ్చు. ఈ యాప్ గురించి సత్తెనపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బార్, వైన్ షాపుల వ్యాపారులకు ఎక్సైజ్ సీఐ విజయకుమార్ అవగాహన కల్పించారు. కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు, మరో వైపు లిక్కర్ షాపులు, బార్ల వద్ద నాణ్యమైన మద్యం విక్రయాలకు ఈ యాప్ దోహద పడుతుంది. మద్యం బాటిల్స్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాతే మద్యం విక్రయించాలి.

యాప్‌ను ఇలా వాడాలి

సెల్ ఫోన్‌లోని ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ చేశాక రెండు ఎంపికలు కన్పిస్తాయి. ఒకటి వినియోగ దారుల కోసం, మరొకటి మద్యం దుకాణాల నిర్వాహకుల కోసం. వినియోగ దారుడు ఐఎంఎల్ లిక్కర్ బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. ఆ తర్వాత వెరిఫై ప్రొడక్ట్‌ను ఎంపిక చేయగానే మద్యం బాటిల్ పై ఉన్న బ్యాచ్ నంబరు, ఎక్కడ తయారైంది.. ఎటు నుంచి వచ్చింది.. బ్రాండ్ పేరు, ధర వివరాలన్నీ స్కాన్ పై డిస్‌ప్లే అవుతుంది. ఒక వేళ అది నకిలీ మద్యం అయితే డిటెయిల్స్ నాట్ ఫౌండ్ కన్పిస్తుంది. ఈ యాప్‌లోని సమాచారం జిల్లా కేంద్రంలోని అధికారులకు, రాష్ట్రస్థాయి అధికారుల డేటా బేస్‌కు వెళ్తుంది.

ఇకపై అబద్ధపు ప్రచారం చేయలేరు

ఇకపై మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం ఉందనే అపోహలు, వదంతులు సృష్టించ లేరు. ప్రభుత్వం, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌పై అబద్ధాలు ప్రచారం చేసే అవకాశాలు ఉండవు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అసలు మద్యం కొనుగోలు చేయాలి. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవు.

పీ విజయకుమార్, ఎక్సైజ్ సీఐ, సత్తెనపల్లి

పెదకాకాని శివాలయంలో.. కార్తీక మాస ఏర్పాట్లు

పెదకాకాని, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా శైవక్షేత్రాల్లో అత్యంత ప్రసిద్ధిగాంచిన పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి నవంబరు 20 వరకు కార్తీక మాస పూజలు జరుగుతాయని ఆలయ ఉప కమిషనర్ జి.లీలాకుమార్ గురువారం తెలిపారు. స్వామి వారికి కార్తీక మాసంలో.. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు రుద్రాభిషేకాలు, చండీ హోమం, అష్టోత్తర తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిత్య పరోక్షసేవ అభిషేక పథకానికి భక్తులు రూ.1,000 చెల్లించి పాల్గొనవచ్చన్నారు. కార్తీక మాసం అనంతరం స్వామి వారి ప్రసాదం పోస్టు ద్వారా భక్తుల చిరునామాకు అందజేయడం జరుగుతుందన్నారు. ఆది, సోమ వారాల్లో.. పౌర్ణమి రోజు మినహా ప్రత్యేక క్యూలైను ద్వారా స్వామి వారి దర్శనానికి అనుమతి స్తామని ఆలయ ఉప కమిషనరు లీలాకుమార్ తెలిపారు. ప్రత్యేక క్యూ లైన్లు, శానిటేషన్, పోలీసు, అగ్నిమాపక, వైద్య, విద్యుత్, గ్రామ పంచాయతీ తదితర శాఖల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


ప్రత్యేక అలంకరణలో పెదకాకాని మల్లేశ్వర స్వామి

నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి

● రాజధానిలో ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి పర్యటన


తుళ్లూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి ఇంజనీరింగ్ గుత్తేదారులను ఆదేశించారు. గురువారం సీడ్ యాక్సెస్ రోడ్డు పొడిగింపు పనులను ఉండవల్లి వద్ద ఆయన పరిశీలించారు. కృష్ణా వెస్ట్రన్ కెనాల్ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తిచేయాలని ఎన్‌సీసీ సంస్థ ప్రతినిధులకు సూచించారు. పెనుమాక వద్ద 190 ఎకరాల్లో ప్రారంభించిన రిజర్వాయర్ పనులను పరిశీలించారు. 0.1 టీఎంసీ సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్‌లో కొండవీటివాగు, పాలవాగు ద్వారా వచ్చే నీటిని నిల్వ చేయనున్న నేపథ్యంలో.. శీఘ్రంగా అందుబాటులోనికి తీసుకురావాలని ఎంవీఆర్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. అబ్బరాజుపాలెం, నేలపాడు వద్ద జరుగుతున్న జోన్ - 5డీ, జోన్ -3 ఎల్పీఎస్ లే అవుట్ నిర్మాణాల పనులను పరిశీలించారు. ఎల్పీఎస్ లే అవుట్లలో జరుగుతన్న అంతర్గతర రోడ్లు, డ్రెయినేజీ, బఫర్ జోన్ల వంటి ముఖ్యమైన మౌలిక వసతుల అభివృద్ధి వంటి పనులను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు అందుబాటులోనికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఏడీసీ చీఫ్ ఇంజినీర్లు బి.నరసింహమూర్తి, సీహెచ్ ధనుంజయ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


రైతుల ఎల్పీఎస్ లేవుట్‌లలో పనులను పరిశీలిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

● దిగువకు 36,250 క్యూసెక్కులు ● డెల్టా కాలువలకు 13,354 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 49,604 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 7646 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కులు వదులు తుండగా, గుంటూరు ఛానల్ కాలువకు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

1.0183 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండు యూనిట్ల ద్వారా బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0183 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ,ఈఈలు సుబ్రహ్మణ్యం,నాగరాజులు చెప్పారు.ప్రాజెక్టుకు వున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 28,344 క్యూసెక్కులు,టేల్ రేస్ ఛానల్ ద్వారా 8591 క్యూసెక్కులు మొత్తంగా 36,935 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 33,698 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు.రిజర్వాయర్‌లో 75.50 (పూర్తిస్థాయి) మీటర్లమేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

మూతపడిన నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్లు

విజయపురిసౌత్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్ట్ అధికారులు గురువారం ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను మూసివేశారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7852 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,713 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 53,805 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 53,805 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



మొక్కజొన్న రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ..!

రైతుల నుంచి అరువుపై సరుకు కొనుగోలు

గోడౌన్‌లో నిల్వ ఉంచి బ్యాంకులో రుణం

గుట్టుగా విక్రయం.. అక్రమ తరలింపును అడ్డుకున్న రైతులు

మార్టూరు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులకు వ్యాపారి కుచ్చటోపీ పెట్టాడు. రైతుల నుంచి అరువుపై కొనుగోలు చేసిన పంటను వారికి తెలియకుండా బ్యాంకులో కుదవపెట్టినట్టు చూపి గుట్టుగా సరుకు దాటించే ప్రయత్నం చేశారు. విషయం తెలిసి బాధిత రైతులు అడ్డుకున్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో వరికల్లు నాగేశ్వరరావు అలియాస్ నాగు అపరాల వ్యాపారం చేస్తుంటాడు. నమ్మకమే పెట్టుబడిగా వ్యాపారం సాగుతోంది. ఆయన మూడు నెలల క్రితం రైతుల వద్ద నుంచి మొక్కజొన్నలు కొనుగోలు చేసి కొనంకిలోని తన గోడౌన్‌లో నిల్వ చేసుకున్నాడు. అనంతరం రైతులకు నగదు చెల్లించకుండా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ ప్రైవేటు ఆన్‌లైన్ ప్రైవేటు సంస్థతోపాటు తాను బాకీ ఉన్న కొంతమందికి సరుకును స్వాధీనం చేశారు. వారు ఒకటి రెండు పర్యాయాలు గుట్టుగా ఇక్కడి నుంచి సరుకును అక్కడి నుంచి తరలించారు. గురువారం కూడా అలానే సరుకు తరలిస్తుండగా, కొంతమంది రైతులు గొడౌన్ వద్ద అడ్డుకున్నారు. తమకు డబ్బులు చెల్లించకుండా సరుకు ఎలా తీసుకెళతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడౌన్ వద్ద ప్రైవేటు బ్యాంక్ వారికి అడ్డుతగిలారు. వారి మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకొంది. సమాచారం అందుకున్న సీఐ ఎం శేషగిరిరావు, ఘటనా స్థలం వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం నాగేశ్వరరావు కోనంకి గ్రామంలో లేకపోవడంతో, శుక్రవారం నాగేశ్వరరావును పిలిపిస్తామని చెప్పి పంపించారు. అప్పటివరకు సంయమనం పాటించాలని, తర్వాత అందరి సమక్షంలో మాట్లాడతానని రైతులకు సీఐ చెప్పడంతో రైతులు నాగేశ్వరరావు రాకకోసం ఎదురు చూస్తున్నట్లు తెలిసింది.

పోషకాహార ప్రాధాన్యతను గుర్తించాలి

● సీడీపీవో సుభద్ర



పర్చూరులో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు

పర్చూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోషకాహార ప్రాధాన్యత ఆవశ్యకతను గుర్తించాలని దీనిపై సీడీపీవో జి.సుభద్ర అన్నారు. పోషణ మాసోత్సవం ముగింపు సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్‌బేబీ ప్రదర్శనల విజేతలకు బహుమతులు అందజేశారు. పౌష్టికారం తీసుకోవడం వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం ఎంఈవో వెంకట్రామయ్య మాట్లాడుతూ బాలికలలో ప్రతిభను వెలికితీసే దిశగా ఐసీడీఎస్ శాఖ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆయా ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీధిశునకాలతో బెంబేలు



చెన్నుపల్లి సమీపంలో నడి రోడ్డు మీద మకాం వేసిన వీధి శునకాలు

బల్లికురవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో వీధి శునకాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పగలురేయి అన్న తేడా లేకుండా వీధి శునకాలు వీధుల వెంట స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో వీధికుక్కలు అధికంగా ఉన్నాయి. బల్లికురవ, చెన్నుపల్లి, కొమ్మినేనివారిపాలెం, మల్లాయపాలెం, కొప్పెరపాడు, కొణిదెన, అంబడిపూడి, వల్లాపల్లి, వైదన, నక్కబొక్కలపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, ఉప్పుమాగులూరు, వేమవరం గ్రామాలలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పలు గ్రామాలలో ఇప్పటికే పలువురిని కుక్కలు కరిచి వైద్యశాల బారిన పడ్డారు. గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే గ్రామాలలో వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బెయిల్‌పై ముప్పా సురేష్ విడుదల

ఒంగోలు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితుడు ముప్పా సురేష్‌కు బెయిల్ మంజూరు కాగా గురువారం ఒంగోలులోని జిల్లా జైలులో ఉన్న ఆయన విడుదల అయ్యారు. అయితే ప్రతి ఆదివారం ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని నిబంధన విధించారు. ఆగస్టు 18న అరెస్టు అయిన సురేష్ 59 రోజుల పాటు రిమాండ్ లో ఉన్నారు.

రేపు చెకుముకి పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విద్యాశాఖ సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 18వతేదీన చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.వెంకట్రావు, జి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

సూపర్ జీఎస్టీతో తగ్గిన వాహనాల ధరలు

● డిప్యూటీ కమిషనర్ సుశీల

● రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించడం వల్ల చిన్న వాహనాల ధరలు తగ్గినట్లు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. గురువారం ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్డు నుంచి బాపూజీ కాంప్లెక్స్ వరకు సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రవాణాశాఖ ఆధ్యరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ రవాణాకు వినియోగించే స్మాల్ వెహికిల్స్‌పై జీఎస్టీ 28 శాతం నుంచి 18శాతం వరకు తగ్గించారన్నారు. ఆటోరిక్షా, మోటార్ కారు, క్యాబ్స్, లారీలు, బస్సులు, ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గించడంతోపాటు 5నుంచి 12శాతం వరకు రాయితీ ఉంటుందని చెప్పారు. గతంలో రూ.9.80 లక్షలు ఉన్న మినీ ట్రక్కుకు తగ్గించిన జీఎస్టీ 10శాతం ప్రమాదకం రూ.2.75లక్షలు, అదే వాహనంపై పన్ను రాయితీ రూ.1.4లక్షలు ధర తగ్గుతుందన్నారు. చిన్న వాహనాలు గతం కంటే 50 శాతం ధరలకే వాహనాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన రాయితీలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఆర్డీవో కళావతి, డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ డి.సత్యప్రకాష్ పాల్గొన్నారు.



ర్యాలీ ముందుభాగాన మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సుశీల

గుండెజబ్బుల బాధితులకు సంజీవని 'సీపీఆర్'

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులబారిన పడిన వారికి తక్షణమే ప్రాణాలు కాపాడే సంజీవని సీపీఆర్ పద్ధతి అని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూర గాయల మార్కెట్ వద్ద ప్రజలకు వైద్యులు, రిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థులు అవగాహన కల్పించారు. గుండెపోటు సంభవించినపుడు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, ఎలాంటి పద్ధతుల పాటించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే అక్కడకు విచ్చేసిన ప్రజలు, వ్యాపారులతో స్వయంగా సీపీఆర్ చేయించగా, మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సీపీఆర్ చేసి, పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రావు, అనస్థీషియా ఇన్‌చార్జి డాక్టర్ చలపతి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, అసోసియేట్ ప్రొఫెసర్ త్రినాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రనీత్, డాక్టర్ యశోవర్ధన్, మెడికల్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు, వైద్య విద్యార్థులు

స్వచ్ఛమిత్రతో నగర పారిశుధ్యం మెరుగు

కమిషనర్ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణ కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తొలిసారిగా చేపడుతున్న స్వచ్ఛమిత్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఐటీసీ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో పారిశుధ్య విభాగం సిబ్బంది, శానిటరీ సెక్రటరీలకు స్వచ్ఛమిత్రపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడిచెత్త సేకరణలో భాగంగా పొడి చెత్తను సంపద కింద మార్చే ప్రక్రియను స్వచ్ఛమిత్ర ద్వారా చేపట్టనున్నట్లు చెప్పారు. అందుకోసం ఐటీసీ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని వివరించారు. కార్పొరేట్ రెస్పాన్సిబులిటీ స్కీమ్ కింద నిర్వహించే ఈ కార్యక్రమం పైలట్ ప్రాజెక్టుగా ఒంగోలు కార్పొరేషన్‌ను ఎంచుకున్నారన్నారు. తద్వారా పొడి చెత్తను ప్రత్యేకమైన మిషన్‌లో శుభ్రపరిచి, పలు కంపెనీలకు సరఫరా చేయవచ్చని పేర్కొన్నారు. అందుకోసం ఐటీసీ కంపెనీ ప్రతినిధులు ప్రతి ఐదు డివిజన్‌లకు ఒకరు ఉంటారని, వారు కార్పొరేషన్ శానిటరీ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పని చేస్తారని తెలిపారు. నగర సుందరీకరణ కోసం చేపడుతున్న బృహత్తర కార్యక్రమాన్ని ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని కమిషనర్ కోరారు. మూడు సంవత్సరాలపాటు స్వచ్ఛమిత్ర, కార్పొరేషన్‌తో కలిసి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమాకాంత్, ప్రతినిధి సుధ, సోషల్ యాక్టివిటీ ఫర్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ సునీల్, హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ బాబ్జి, ఎస్.పిచ్చయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా వైసీపీ

● ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్



షారోన్, గౌతమ్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న వెంకటేష్

కొత్తపేట (చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సముద్ర తీరంలో అలల తాకిడికి మృతి చెందిన షారోన్, గౌతమ్ కుటుంబాలకు వైసీపీ అండగా ఉంటుందని, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. గురువారం కొత్తపేటలోని బాధిత కుటుంబ సభ్యుల నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఘటనపై ఆరా తీసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ వ్యవస్థ తీరును నిరసిస్తూ, మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి


● గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌పై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌పై సంబంధితశాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ కింద 50 ఎకరాల భూసేకరణ చేయకపోవటంతోనే జిల్లాలో 13,876 ఎకరాలకు సాగునీరు రావటంలేదని చెప్పారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో 50ఎకరాల భూసేకరణ పనులు నిలిచిపోవటంపై ఆరాతీశారు. తక్షణమే భూసేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మ ప్రాజెక్ట్ 17గేట్లు మరమ్మత్తులు పూర్తి కాగా మరొకటి పనులు జరుగుతున్నాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్ట్ ద్వారా బీడుభూములకు సాగునీరు అందించటం లక్ష్యమన్నారు. తాజాగా బాపట్లజిల్లాలో 2,600 ఎకరాలభూమి ఆయుకట్టు పరిధిలోకి తీసుకురావటానికి గజిట్ విడుదల చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం అధికారికంగా ప్రకటన విడుదలకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో 78 ఎకరాల భూమి ఆయుకట్టులోకి తెచ్చేందుకు జలవనరులు, వ్యవసాయ, రెవెన్యూశాఖాధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాల్సి ఉందన్నారు. ఈప్రక్రియ వారంలో పూర్తి చేయాలన్నారు. కొరిశపాడు, అద్దంకి మండలాలలో మూడు గ్రామాలలో 1100 కుటుంబాలకు పునరావాసం కింద నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆర్డీవో, సంబంధిత తహసీల్దార్‌లకు సూచించారు. సమావేశంలో ప్రాజెక్టల ఎస్ఈ అబూతలీమ్, ఆర్డీవో చంద్రశేఖర్, ఉపకలెక్టర్‌లు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వేటపాలెం (చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత నెల 19న ఈ నెల 8-10 మధ్య 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డివిజన్ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వేటపాలెం మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. దీంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈక్రమంలో గురు వారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షేమ హాస్టళ్లలో అధ్వాన పరిస్థితులు

● సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళలో పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం ఆ పార్టీ నాయకులు తం బి శ్రీనివాసులు, ఎస్‌డీ.హాస్సేన్ తదితర నాయకులు నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర కాలేజీ వసతిగృహాలను సందర్శించి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్టీ బాలుర వసతి గృహం ఆవరణ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని వసతిగృహాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల సాంఘికసంక్షేమశాఖ మంత్రి వసతిగృహాలను సందర్శించి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖతార్ తెలుగు సంఘం ఎన్నికలలో ప్రకాశం వాసి విజయం

అవీఇవీ

తన ప్యానల్‌లోని పది మందిని గెలిపించి సత్తాచాటిన గొట్టిపాటి రమణ



విజయోత్సవ సభలో విక్టరీ సింబల్ చూపుతున్న రమణ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖతార్‌లోని ఆంధ్ర కళా వేదిక అనే తెలుగు ప్రవాసీ సంఘానికి ఉత్కంఠభరితంగా జరిగిన ఎన్నికలలో ప్రకాశం జిల్లా మారుమూల గ్రామానికి చెందిన ప్రవాసీ గొట్టిపాటి రమణ విజయం సాధించారు. భారతీయ ఎంబసీ అధ్వర్యంలోని ఐసీసీ అనే భారతీయ సంఘాల సమాఖ్య పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించారు. వీటి ఫలితాలను బుధవారం రాత్రి ప్రకటించారు. తాను విజయం సాధించడమే కాకుండా తన ప్యానల్ నుంచి పోటీ చేసిన మరో పది మందిని కూడా గెలిపించిన రమణ ఖతార్‌లోని తెలుగు ప్రవాసీ సమాజంలో తన సత్తాను చాటారు. జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన గొట్టిపాటి రమణ ఖతార్‌లో ప్రముఖ ఇంజినీర్, జిల్లాకు చెందిన అనేక మంది యువకులకు ఖతార్‌లో ఉపాధి కల్పించిన ఆయనకు అందరితోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. టీడీపీ ఖతార్ శాఖ అధ్యక్షుడు కూడా అయిన రమణ అక్కడి భారతీయ సామాజిక సేవకులలో ఒకరు.

బీసీ వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలి

పనితీరు ఆధారంగా వార్డెన్లకు ర్యాంక్‌లు

సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ

ఒంగోలు నగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ ఆదేశించారు. గురువారం స్థానిక ప్రకాశం భవనంలోని పీజీఆర్ఎస్ సమావేశం హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణనే ప్రధాన లక్ష్యంగా వసతి గృహాల సంక్షమ అధికారులు పనిచేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు తాగునీరుగా అందించాలని చెప్పారు. హాస్టళ్లను, వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మెనూను కచ్చితంగా అందించాలని కోరారు. ఇక నుంచి పనితీరు ఆధారంగా వార్డెన్లకు ర్యాంకులు కేటాయిస్తామన్నారు. పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఇప్పటి నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖరరాజు, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల కార్యదర్శి మాధవీలత, నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటలక్ష్మి, ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి నిర్మల జ్యోతి, నెల్లూరు, జిల్లాల్లోని వసతి గృహాల సంక్షేమశాఖాధికారులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

టంగుటూరు (కొండపి), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కారుమంచి గ్రామంలో జరిగింది. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన కథనం ప్రకారం.. కారుమంచి గ్రామానికి చెందిన దామవరపు అరవింద్ చీరాలకు చెందిన వహీద (26) ప్రేమించుకుని పెద్దల సమ్మతితో 2019లో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి వారు కారుమంచిలో నివాసం ఉంటున్నారు. వహీదాకు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడు తున్నారు. ఈ క్రమంలో గురువారం విపరీతంగా వహీదాకు కడుపునొప్పి రావడంతో భరించలేక బుధవారం ఉదయం ఇంటిలో ఉన్న ఎలుకల మందు తిన్నది. ఆమెను భర్త ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించింది. మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఆమె మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్









నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)





సభలో ఉప్పొంగిన దేశభక్తి



సభలో టీడీపీ మహిళా నేతలు





శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ





పొలాల వెంబడి పరుగులు

అవీ..ఇవీ..

గ్రామస్థులకు మొక్కల పంపిణీ



గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

యద్దనపూడి,(మార్టూరు), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ యూనివర్సల్ టుబాకో వారి సంయుక్త ఆధ్వర్యంలో యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామానికి 400 మొక్కలను పంపిణీ చేశారు. దీంతో గురువారం ఈ మొక్కలను టీడీపీ గ్రామ నాయకులు గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ తదితరులు గ్రామస్థులకు పంపిణీ చేశారు. గతంలో కూడా ఈ సంస్థ వారు గ్రామానికి చెందిన చెరువు కట్టపై మొక్కలను నాటారు. చెరువులో పూడికతీతమట్టిని తీసి, చెరువు కట్టను పటిష్ఠం చేశారు. వారు గ్రామస్థులకు జామ, మామిడి, నిమ్మ, సపోటా, సీతాఫలం, నేరేడు తదితర మొక్కలను పంపిణీ చేశారు. గ్రామస్తులందరూ ఐక్యంగా కలిసి మెలిసి నాటిన మొక్కలు పెరిగే విధంగా కృషి చేయాలని, పర్యావరణాన్ని రక్షించాలని సంస్థ ప్రతినిధులు రత్నకుమార్, విక్రమ్ లు గ్రామస్థులను కోరారు.

అవకతవకలకు పాల్పడిన బ్యాంకు మేనేజర్‌పై కేసు నమోదు

బల్లికురవ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో ఖాతాదారులకు తెలియకుండా వారి అనుమతులు లేకుండా వారి పేర్లపై లావాదేవీలు జరిపి అవకతవకలకు పాల్పడిన కొణిదెన స్టేట్‌బ్యాంకు పూర్వ మేనేజర్ అయప్పపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.నాగరాజు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కొణిదెన స్టేట్‌బ్యాంకులో 2022- 23 సంవత్సరంలో అయప్ప అనే వ్యక్తి మేనేజర్‌గా పనిచేసిన కాలంలో తమ బంధువులు ఇతరులకు చెందిన 58 అకౌంట్లకు వారి అనుమతులు లేకుండా ఎలాంటి రశీదులు నమోదు చేయకుండా రూ. 13 లక్షల మేర లావా దేవీలు జరిపి బ్యాంకు నిధులను పక్కదారి పట్టించాడు.. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారులు కూడా విచారించి అవకతవకలు చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దీంతో ఇప్పుడు విధులలో ఉన్న మేనేజర్ రమేష్ పూర్వపు మేనేజర్ చేసిన అవకతవకలపై బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గతంలో కొణిదెన బ్యాంకులో పూర్వపు మేనేజర్ అయప్పపై అదే బ్యాంకులో పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగి కూడా బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. తన సొంత బంధువులకు రాయితీ రుణాలను కూడా మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ ఆంజనేయులు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రేణంగివరం, అలవలపాడు, కశ్యాపురం, జాగర్లమూడి వారిపాలెం, ముప్పవరం, భైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, కొండమూరు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపవేస్తున్నట్లు ఏఈఈ ఆంజనేయులు తెలిపారు.

● అద్దంకి సబ్‌స్టేషన్ పరిధిలో..

అద్దంకి,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్‌కు కొత్తలైన్ ఏర్పాటు పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు. మండలంలోని తిమ్మాయపాలెం, గోపాలపురానికి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం, మౌలానగర్, కలవకూరు రోడ్డు, ద్వారకానగర్, ఆటోనగర్, శింగరకొండ తదితర ప్రాంతాలలో మధ్యహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై డ్రోన్ సాయంతో దాడి

● ఐదుగురు జూదరులను అరెస్టు చేసిన పోలీసులు

ఇంకొల్లు, అక్టోబరు 16,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు సమీపంలోని పేకాట స్థావరంపై సీఐ వైవీ.రమణయ్య గురువారం డ్రోన్‌సాయంతో దాడులు నిర్వహించారు. పర్చూరు రోడ్డు సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.5030 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

సుధీర్‌కు క్వారీ యజమానుల జన్మదిన శుభాకాంక్షలు



గజమాలను వేస్తున్న ఉప్పుటూరి కృష్ణ, ఆయన మిత్రులు

బల్లికురవ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ జన్మదిన వేడుకలలో భాగంగా గురువారం బల్లికురవ లక్ష్మీ గ్రానైట్ క్వారీ ఇన్‌చార్జ్ ఉప్పుటూరి కృష్ణ ఆధ్వర్యంలో ఒంగోలు తరలి వెళ్లి సుధీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గజమాలను వేశారు. ఈసందర్భంగా లక్ష్మీ గ్రానైట్ క్వారీ సిబ్బందితో పాటు బల్లికురవ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఫ్యాక్టరీల యజమానులు, గ్రామ నేతలు సుధీర్‌కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు ఒంగోలు తరలి వెళ్లారు.

అపరిశుభ్రంగా గ్రామాలు -ప్రమాదభరితంగా వీధులు

- నాన్పుడు వర్షంతో ప్రబలుతున్న రోగాలు
- విధులకు రాని పారిశుధ్య కార్మికులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజులుగా నియోజకవర్గంలో కురుస్తున్న ఎడతెరపిలేని నాన్పుడు వానతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారులు సైతం నీళ్ల నిండి కాలువలను తలపిస్తున్నాయి. అంతేకాకుండా కొన్ని రోడ్లు మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరికొన్ని రోడ్లు కోతకు గురికావడంతో ఆ ప్రాంతాల్లో వాహనదారులు పట్టుతప్పి కింద పడుతున్నారు. గతంలో పాలకులు మరమ్మతులు చేపట్టిన అది క్షేత్రస్థాయిలో అమలు జరగలేదు. కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టినా, సేవలు పారదర్శకంగా లేకపోవడంలో నీళ్లభారీగా నిలుస్తున్నాయి. ఈపూరుపాలెం వద్ద నుంచి పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగానే ఉన్నాయి. దీంతో నిత్యం చీరాల నుంచి బాపట్ల, గుంటూరు, విజయవాడకు వెళ్లే బస్సులు, భారీ వాహనాల వారు నానా తంటాలు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈ మార్గంలోనే ఈపూరుపాలెం వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. అంతేకాకుండా వంతెనపై గుంతలు పడుతున్నాయి. దాదాపుగా మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. అంచుల్లో ఉన్న దిమ్మెలు పూర్తిగా విరిగిపోయాయి. దీనికి తోడు నాన్పుడు వాన తోడు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన అవసరాలకు అనుగుణం గా నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ప్రజలు, విశ్లేషకులు చెబుతున్నారు.



ప్రమాదభరితంగా ఉన్న ఈపూరుపాలెం వంతెన



ఈపూరుపాలెంలో అధ్వానంగా ఓ వీధి

జీతాలు లేక పనులకు రాక..

ఎన్నికలు లేని కారణంగా పంచాయతీలకు నిధుల్లేవు. దీంతో పారిశుధ్య కార్మికులకు జీతభత్యాలు అందడం లేదు. ఒక్కో పంచాయతీలో నాలుగు లేక ఆపైనే మాసాలకు సంబంధించి జీతాలు నిలిచాయి. దీంతో దాదాపుగా నియోజకవర్గంలో సింహ భాగం గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు పనులకు మొరాయించారు. ఈ క్రమంలో వీధులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

బాణసంచా దుకాణాలలో జాగ్రత్తలు పాటించాలి

గోడౌన్లను పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీ

అద్దంకి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల వద్ద అన్ని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు అన్నారు. పట్టణంలోని శింగరకొండ రోడ్డు, ఒంగోలు రోడ్డులలోని బాణసంచా లైసెన్స్‌డ్ దుకాణాలను గురువారం సాయంత్రం ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు చీరాల డీఎస్పీ మొయిన్‌లు పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆకస్మికంగా ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ శ్రీచరణ్, సీఐ సుబ్బరాజు, ఆర్ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని క్రాకర్స్ గోడౌన్ నిర్వాహకులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్ చెప్పారు. గురువారం వేటపాలెం, కారంచేడు మండల పరిధిలోని గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా క్రయ విక్రయాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పరిసరాల్లో ప్రమాదల నియంత్రణకు తీసుకున్న జాగ్రత్తలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట అగ్నిమాపక శాఖ ఏడీ రామకృష్ణ, తహసీల్దార్‌లు గీతారాణి, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.



గోడౌన్లను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ మొయిన్

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ రమేష్

సంతమాగులూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ ద్వారా గర్భిణులు, బాలింతలకు బాలికలకు ప్రభుత్వం పౌష్టికారం అందజేస్తోందని, సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్ తెలిపారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు న్యూట్రిషియన్ స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి చిరుధాన్యాలతో చేసిన వంటలను రుచి చూశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి సారే అందజేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా సేవలందించిన వారికి ప్రతి సెక్టార్ నుంచి ఒక ఉత్తమ అంగన్వాడీ కార్యకర్తలను గుర్తించి వారికి జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. కొప్పరం పంచాయతీలోని నెహ్రూ నగర్ అంగన్వాడి టీచర్ మొగిలి తిరుమల తన 13 సంవత్సరాల కుమారుడు సిద్ధార్థ అండర్-14వ జట్టు కింద అంతరాష్ట్ర క్రికెట్ జట్టులో గెలిచినందుకు తిరుమలను ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్, సీడీపీవో డి సుధ, ఐసీడీఎస్ సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీ ఎస్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, రెండు మండలాల అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



పోషణ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్

చక్కటి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం

ఇంకొల్లు : చక్కటి ఆరోగ్యకర అలవాట్లతో ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇంకొల్లు సీడీపీవో సులోచనరాణి అన్నారు. స్థానిక రోటరీగంగ భవనంలో నేషనల్ గర్ల్‌చైల్డ్‌డే సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాచరచన ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు ఎంఈవో శ్రీనివాసరావు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అనంతరం ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

ఇంకొల్లు, అక్టోబరు 16,(ఆంధ్రజ్యోతి) : వరుస ఘటనలతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంకొల్లు నుంచి ఒంగోలు చేరుకోవాలంటే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మొన్నమొన్నటి వరకు కురిసిన వర్షాలకు రెండు మూడు రోజులు ప్రధాన రహదారి పాతమద్రాసు రహదారిలో వంకాయలపాడు, దుద్దుకూరు గ్రామాల వద్ద వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం మోది సభకు ఆర్టీసీ, బస్సులను తరలించడంతో బస్సులు లేక ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించారు. ఇంకొల్లు నుంచి చీరాల, చిలకలూరిపేట, గుంటూరు, ఒంగోలు చేరుకునేందుకు అవస్థలు పడ్డారు. దీంతో ఇంకొల్లు బస్టాండు గురవారం బస్సులు లేక వెలవెలబోయి కనిపించింది .కేవలం నాలుగైదు బస్సులు మాత్రమే తిరగడంతో ప్రయాణికులు గమ్యస్థానాలు చేరేందుకు ఇబ్బందులు పడ్డారు.



నిర్మానుష్యంగా ఉన్న ఇంకొల్లు బస్టాండు

బైకు ట్యాంక్ కవర్‌లోని నగదు అపహరణ

బంగారం తాకట్టుపెట్టి రుణం తీసుకొని ఇంటికి వెళ్తుండగా ఘటన

అద్దంకి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లో బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణం డబ్బులు మోటార్ సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉంచగా, ఆ నగదు అపహరణకు గురైంది. ఈ ఘటన అద్దంకి పట్టణంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఉమామహేశ్వర పుర అగ్రహారానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి గురువారం మధ్యహ్నం అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం రోడ్డులోని బ్యాంక్‌లో బంగారం తాకట్టు పెట్టి రూ.1.40 లక్షల రుణం తీసుకున్నాడు. నగదును మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్ లో పెట్టి నామ్ రోడ్డు లో పోతురాజుగండి వద్ద ఉన్న ఆటోమొబైల్ షాపులోకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉంచిన రూ.1.40 లక్షల నగదు మాయమైంది. దీంతో బాధితుడు వెంకటేశ్వరరెడ్డి అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అద్దంకి పట్టణంలో దొంగలు బ్యాంకు వద్ద మాటు వేసి తరచూ ఇదే తరహా దొంగతనాలకు పాల్పడుతున్నారు.

వీధి కుక్కల దాడిలో 16 పొట్టేళ్లు మృతి

● రూ. 2 లక్షల మేర నష్టం ● బాధితుడి అవేదన



వీధి కుక్కల దాడిలో మృతి చెందిన పొటేళ్లు

బల్లికురవ, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో గురువారం షేక్ వలి అనే రైతుకు చెందిన 16 పొటేళ్ల పిల్లలు వీధికుక్కల దాడిలో మృతి చెందాయి. అందిన సమాచారం మేరకు కొప్పెరపాడు ముస్లీం కాలనీకి చెందిన షేక్ వలి పొటేళ్ల పిల్లలను కొనుగోలు చేసి పెంచుకుంటున్నాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా పొటేళ్ల మందపై దాడి చేయటంతో 16 పొటేళ్లు మృతి చెందాయి. మృతి చెందిన పొటేళ్ల విలువ రూ. 2 లక్షల మేర ఉంటుందని బాదిత రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని అయన కోరారు.

ఏబీసీ కాలువ వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభం

● పొంచి ఉన్న ప్రమాదం

బల్లికురవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామ పరిధిలోని అద్దంకిబ్రాంచ్ కాలువ వంతెన వద్ద వ్యవసాయ విద్యుత్ లైన్ ఒరిగింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని నెలల నుంచి విద్యుత్ తీగల సపోర్టుతో విద్యుత్ స్తంభం సగానికి వాలి ఉందని ప్రతిరోజు పంట పొలాలకు వెళ్లే రైతులు ఈ స్తంభాన్ని చూసి భయపడుతున్నారు. ఈ స్తంభం పడితే విద్యుత్ లైన్ మెత్తం బ్రేక్ అవుతుందని రైతులు తెలిపారు. కొమ్మినేని వారిపాలెం నుంచి అంబడిపూడి వెళ్లే మెయిన్ రోడ్డు ప్రక్కనే ఈ స్తంభం ఉందని బాటసారులు కూడా నిత్యం వెళుతుంటారని ప్రమాదం జరగక ముందే అధికార్లు విద్యుత్ స్తంభాన్ని సరిచేయించాలని రైతులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా వాలి ఉన్న విద్యుత్ స్తంభం

విద్యారంగ ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యం : ఏపీటీఎఫ్



ప్రమాణం చేస్తున్న నూతన మండల కార్యవర్గం

పంగులూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యారంగ ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యంగా ఏపీటీఎఫ్ పనిచేస్తోందని జిల్లా కమిటీ సభ్యులు కంకణాల శ్రీనివాసరావు, చేజర్ల చెంచురామారావు, రాష్ట్ర కౌన్సిలర్ జంపని వెంకటేశ్వర్లు (జేవీఆర్) అన్నారు. ఏపీటీఎఫ్ మండలశాఖ సర్వసభ్య సమావేశం తన్నీరు వెంకట్రావు అధ్యక్షతన పంగులూరులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తన్నీరు వెంకటరావు, షేక్ రహంతుల్లా, ఉపాధ్యక్షులుగా పోతుగంటి ఆంజనేయులు, కె.మనోహర్, బాచిన లక్ష్మీసులోచన, కార్యదర్శులుగా తానికొండ ప్రమీల, దాసరి శ్రీనివాసరావు, గింజిపల్లి శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా జంపని వెంకటేశ్వర్లు, కె.వి.కె.నరశింహమూర్తి, కె.శ్రీనివాసరావు ,బి.లలితకుమారి, ఆర్.వి.సుబ్బారావు, చెంచురామారావులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా కరి రామయ్య వ్యవహరించారు. సీనియర్ ఉపాధ్యాయులు పూసల రామారావు, కె.శ్రీనివాసరావు, చిలుకూరి శ్రీనివాసరావులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో నత్రజని, పొటాషియం పెంపు

● ఏరువాక కేంద్రం సమన్వయకర్త అచ్యుతరాజు



ఏరువాక కార్యక్రమంలో అధికారులు, రైతులు

తోటవారిపాలెం(చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సాగులో రైతులు జీవన ఎరువులను వినియోగించడం ద్వారా నత్రజని, పొటాషియం శాతం పెరుగుతుందని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కే.అచ్యుతరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని తోటవారిపాలెం రైతుసేవా కేంద్రం వద్ద ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక దిగుబడులు సాధించాలంటే జీవన ఎరువుల వినియోగం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

రేపు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొనున్నారు. ఉదయం 10 గంటలకు కొరిశపాడు మండలం తమ్మవరంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, 11 గంటలకు అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, మధ్యాహ్నం 12 గంటలకు అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు.

సూపర్ జీఎస్టీతో సామాన్యులకు సూపర్ సేవింగ్స్

చీరాలలో అధికారుల అవగాహన ర్యాలీ

చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సూపర్ జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు మేలు చేకూరుతుందని స్టేట్ అసిస్టెంట్ ట్యాక్స్ కమిషనర్ ఆర్.శ్రీనివాసరావు, స్టేట్ ట్యాక్స్ అధికారి జమీర్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. గురువారం పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వాహనాల కొనుగోలుపై తగ్గిన మొత్తాలను వివరించారు. అలాగే బీమా వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్‌లు, వాహన దారులు పాల్గొన్నారు.

పర్చూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్టీ తగ్గింపు చర్యతో ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని చీరాల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ అన్నారు. రవాణాశాఖ అధ్వర్యంలో తగ్గిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ చిన్న తరహా వాహనాలపై ప్రభుత్వం జీఎస్టీ 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించిందన్నారు. ఇవే కాకుండా నిత్యావ సరవస్తువులు, గృహోపకరణాలు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలపై కూడా జీఎస్టీ తగ్గించారని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఎస్సై జీవీ.చౌదరి కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, ట్రైనీ ఎస్సై గోపీ, ఏపీ ముస్లీం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్.షంషుద్దీన్, కోటా నాగభూషణం, షేక్. ఫిరోజ్ బాషా, సుబ్బారావు, వాహనాల షోరూం నిర్వహకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది. ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకి : అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగేలా సూపర్ జీఎస్టీ శ్లాబుల సవరణ ఉందని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం అద్దంకి పట్టణంలోని దామావారిపాలెం నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు నామ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీకి తహసీల్దార్ శ్రీచరణ్ జెండా ఊపి ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీచరణ్ మాట్లాడుతూ ఒక దేశం-ఒకే పన్ను విధానంతో జీఎస్టీ తగ్గింపు ఫలాలు అందుతున్నాయన్నారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునరావు, సీఐ సుబ్బరాజు, అసిస్టెంట్ ఎంవీఐ కిషోర్, మన్నం త్రిమూర్తులు, దూళిపాళ్ల సుబ్బారావు, నరేంద్ర, అంకమ్మరావు, ఆటోయూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రవర్తి రాంబాబు, రాజా, తిరుపతయ్య, దస్తగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు